విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రాజయ్య

'ఇందిరమ్మ ఇండ్ల'పై రీసర్వే చేయాలి

మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య డిమాండ్

స్టేషన్‌ఘన్‌పూర్, జూన్ 7 : స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలోని ఇందిరమ్మ ఇండ్లపై రీసర్వే చేసి నిజమైన పేదలను లబ్దిదారులను ఎంపిక చేయాలని మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య డిమాండ్ చేశారు. శనివారం ఆయన శివునిపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల్లో తమకు ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని పేద కుటుంబానికి చెందిన రజితానాగరాజు స్థానిక ఎమ్మెల్యే శ్రీహరిని అడిగేందుకు వస్తే పోలీసులు లాక్కెళ్లారని విమర్శించారు. దీంతో ఆమె చేతికి గాయమైందన్నారు. నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపు విషయంలో అన్ని గ్రామాల్లో అవకతవకలు జరిగాయన్నారు. దీనిపై రీసర్వే చేయాలన్నారు. శివునిపల్లిలో అధికారులు ముందుగా ప్రకటించిన 40 మంది జాబితాను రాత్రికి రాత్రే మార్చారని రాజయ్య తెలిపారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి అనుచరులు కొన్ని పేర్లను తొలగించి, వారికి దగ్గరగా ఉన్న వారి పేర్లను చేర్చుకుని నిజమైన పేదలకు తీరని అన్యాయం చేశారని వివరించారు. రజితానాగరాజు ఇల్లును పరిశీలించగా కనీసం గోడలు కూడా లేవని, దీంతో రేకులు ఏర్పాటు చేసి నివాసముంటున్నారని అన్నారు. అన్ని అర్హతలున్నా కావాలనే ఆమె పేరును కడియం వర్గీయులు తొలగించారని రాజయ్య విమర్శించారు. దీనికి కారణమైన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. రజిత కుటుంబానికి వెంటనే ఇల్లు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో ఇప్పటికైనా నియోజకవర్గ వ్యాప్తంగా రీసర్వే చేయాలని, లేకుంటే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మహాధర్నా చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మాచర్ల గణేశ్, మాజీ సర్పంచ్ సురేశ్‌కుమార్, నాయకులు గణేశ్, కుమార్, వీరాసింగ్, గుర్రం శ్రీను, చిట్టిబాబు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ భూముల్లో పొంచి ఉన్న ప్రమాదం

సిద్దెంకిలోని వ్యవసాయ భూమిలో వంగిన స్తంభం

జనగామ రూరల్, జూన్ 7 : మండలంలోని సిద్దెంకిలో విద్యుత్ స్తంభాలు ప్రమాదానికి నిలయంగా ఉన్నాయి. గ్రామానికి చెందిన పుప్పాల లక్ష్మయ్య బావి వద్ద గాలి దుమారానికి విద్యుత్ స్తంభం ఓవైపు ఒరిగింది. ఇది ఎప్పుడు కూలుతుందో.. ఏ ప్రమాదం జరుగుతుందోనని రైతులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షాలు కురిసినా, ఈదురుగాలులు వీచినా స్తంభాలు కూలేట్లు ఉన్నాయి. విద్యుత్ అధికారులు స్పందించి వంగిన స్తంభాన్ని సరి చేయాలని కోరుతున్నారు.



జనగామలోని ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

దేవరుప్పులలో మాట్లాడుతున్న పాలకుర్తి సీఐ మహేందర్‌రెడ్డి

భక్తిశ్రద్ధలతో బక్రీద్ వేడుకలు

- జిల్లాలోని మసీదులు, ఈద్గాల వద్ద ముస్లింల ప్రార్థనలు
- అలయ్ బలయ్‌తో శుభాకాంక్షలు

నమస్తే నెట్‌వర్క్ జూన్ 7 : బక్రీద్ పర్వదిన వేడుకలను శనివారం జిల్లావ్యాప్తంగా ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. జిల్లా కేంద్రంలోని ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేసి ఒకరినొకరు శుభాకాంక్షలు తెలిపారు. త్యాగానికి గుర్తుగా బక్రీద్ పండుగను జరుపుకుంటున్నట్లు ఇమామ్‌లు పేర్కొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అర్బన్ సీఐ దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు ఈద్గాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు జమాల్ షరీఫ్, అన్వర్ పాషా, యాకుబ్, ఎజాజ్ పాల్గొన్నారు. పెద్దపహాడ్‌లోని మసీదులో ముస్లింలు ప్రార్థనలు చేశారు.

జిల్లా వ్యాప్తంగా ముస్లింల ప్రార్థనలు

నర్మెటలోని ఈద్గా వద్ద ముస్లింలు భక్తి శ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. మత గురువులు బక్రీద్ సందేశాన్ని వివరించారు. కార్యక్రమంలో జడ్పీ కోఆప్షన్ మాజీ సభ్యుడు ఎండీ గౌస్, జామియా మసీద్ అధ్యక్షుడు ఆలీమోద్దీన్, రఫీ, లల్లూ, పయాజ్, రజాక్, అజార్, పాల్గొన్నారు. బచ్చన్నపేట, ఆలీంపూర్, బండనాగారం, కట్కూర్, పోచన్నపేట, కొన్నె, తమ్మడపల్లి, చిన్నరామన్‌చర్లలోని ఈద్గాల వద్ద ప్రార్థనలు చేశారు. చిన్నరామన్‌చర్ల మాజీ సర్పంచ్ కలీల్‌ఆజాం, ఆలీంపూర్ మాజీ ఎంపీటీసీ సభ్యులు మసూద్, బీఆర్ఎస్ నాయకులు ఆజీం, షబ్బీర్, జావీద్ బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. రఘునాథపల్లి మండల కేంద్రంతో పాటు ఖిలాషాపూర్, కంచనపల్లి, పతేషాపూర్‌లోని ఈద్గాల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత గురువు మౌలానా నూరి రిజ్వాన్ అహ్మద్ ఖురాన్‌లోని ప్రవచనాలను వినిపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారజోడు రాంబాబు, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల జగదీశ్‌చందర్ రెడ్డి, మండల అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్, సీఐ ఎడవెల్లి శ్రీనివాస్ రెడ్డి, ఎస్సై డీ నరేశ్ ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మదీనా మసీదు అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌కే బషీరుద్దీన్, మహ్మద్ రఫీ, మహ్మద్ బాషుమియా, ఇబ్రహీం పాషా పాల్గొన్నారు. జఫర్‌గఢ్‌లోని మండల కేంద్రంలోని ఈద్గాల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికొకరు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. దేవరుప్పులలో జరిగిన బక్రీద్ వేడుకల్లో పాలకుర్తి సీఐ మహేందర్‌రెడ్డి ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై పదానందం, ముస్లిం మత గురువు ఇనాయత్ రసూల్, గులాం రసూల్, జకీర్, గనీమియా, పాల్గొన్నారు. పాలకుర్తిలోని మసీదుల వద్ద నిర్వహించిన బక్రీద్ వేడుకల్లో సీఐ గట్ల మహేందర్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. త్యాగనీరతికి బక్రీద్ నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో మతపెద్దలు ఎండీ వహీద్, ఎండీ మదార్, ఎండీ రాజు మహ్మద్, ఎండీ ఇమామ్, సలాం, సలీ పాల్గొన్నారు. చిల్పూరు మండల కేంద్రంతోపాటు వెంకటాద్రిపేట, చిన్నపెండ్యాల, రాజవరంలోని ఈద్గాల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు ఎండీ రాజ్‌మహ్మద్, రాజవరం గ్రామ అధ్యక్షుడు యాకూబ్‌పాషా, షకీల్‌పాషా, సజిక్‌పాషా, రబ్బాని పాల్గొన్నారు.

శిఖం భూమిని కబ్జా చేస్తే కఠిన చర్యలు : ఎస్సై

కబ్జాకు గురైన భూమిని పరిశీలిస్తున్న ఎస్సై సృజన్‌కుమార్

దేవరుప్పుల, జూన్ 7: చెరువు శిఖం భూమిని కబ్జా చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడంతోపాటు కేసు నమోదు చేస్తామని ఎస్సై సృజన్‌కుమార్ అన్నారు. మండలంలోని అప్పిరెడ్డిపల్లి ముత్యం చెరువు శిఖం భూమి కబ్జాకు గురవుతున్నదని ఆయకట్టుదారులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన నేపథ్యంలో శనివారం ఎస్సై చెరువు శిఖాన్ని పరిశీలించారు. మాజీ సర్పంచ్‌లు పులిగిల్ల మల్లయ్య, పులగిల్ల సుధాకర్‌తో పాటు ఆయకట్టుదారులు వెంటరాగా ఆక్రమణకు గురైన ప్రాంతాన్ని సృజన్‌కుమార్ పర్యవేక్షించారు. చెరువు శిఖం సర్వే నంబర్ 119లో 143.37 ఎకరాలు ఉండగా దేవరుప్పుల, లింగాలఘనపురం మండల సర్వేయర్లు కొలిచి హద్దులు ఏర్పాటు చేశారు. లింగాలఘనపురం మండలం వడ్డిచర్లకు చెందిన మాజీ ఎంపీటీసీ గండి మంగమ్మ, ఆమె భర్త యాదగిరి ఇదే మండలానికి చెందిన కిష్టగూడెం శివారు భూమిని ఓ రైతు వద్ద కొని తాను కొన్న భూమి చెరువు శిఖంలో ఉందంటూ కబ్జా చేశాడని ఆయకట్టుదారులు ఎస్సైకి తెలిపారు. దీనిపై స్పందించిన ఎస్సై సృజన్‌కుమార్ ఆయకట్టు రైతుల ఫిర్యాదు మేరకు ఆక్రమణదారులను పిలిచి మాట్లాడుతానని, అవసరమైతే కేసు నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, మధుబాబు, మాసంపల్లి నర్సయ్య, పీ. సోమయ్య, యాదయ్య, కొండయ్య పాల్గొన్నారు

15న ఉమ్మడి జిల్లా స్థాయి చెస్ పోటీలు

హనుమకొండ చౌరస్తా, జూన్ 7 : వరంగల్ జిల్లా చదరంగ సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 15న ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి అండర్-13 చదరంగం ఎంపిక పోటీలు నిర్వహించనున్నారు. హనుమకొండలోని పబ్లిక్ గార్డెన్ ఎదురుగా ఉన్న తిరుమల తిరుపతి దేవస్థాన కల్యాణ మండపంలో ఎంపికల పోటీలు నిర్వహిస్తున్నట్లు క్రీడల నిర్వహణ కార్యదర్శి కన్నా తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 1 జనవరి 2012 తర్వాత జన్మించిన వారు వీటికి అర్హులని, క్రీడాకారులు తమవెంట చెస్ బోర్డు తెచ్చుకోవాలని సూచించారు. ఇందులో గెలుపొందిన బాలురు, బాలికల నుంచి నలుగురి చొప్పున ఎంపిక చేసి వచ్చే నెలలో హైదరాబాద్‌లో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతామన్నారు. మరిన్ని వివరాలకు 90595 22986 నంబర్‌లో సంప్రదించాలని కన్నా సూచించారు.

ఉచిత వైద్య శిబిరాలు అభినందనీయం

రఘునాథపల్లి, జూన్ 7: గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని మాజీ జడ్పీటీసీ లింగాల జగదీశ్ చందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని పతేషాపూర్‌లో ఇదే గ్రామానికి చెందిన చింత మహేశ్, పయ్యావుల రఘుపతి ఆధ్వర్యంలో యశోద హాస్పిటల్, నేత్రాలయ హాస్పిటల్ సౌజన్యంతో శనివారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. గుండె, కంటి, అర్థోపెడిక్ మహిళలకు సంబంధించిన ఆరోగ్య సమస్యలపై 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జగదీశ్ చందర్‌రెడ్డి మాట్లాడుతూ ఆధునిక సమాజంలో ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఏర్పాటు చేసే ఇలాంటి వైద్య శిబిరాలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గొట్టం భాస్కర్‌రెడ్డి, గాజులపాటి మహేందర్, కరుణాకర్‌రెడ్డి, హయత్ అలీ, నేతాజీ, షబ్బీర్ మియా, చింత మదార్, వీరోజీ, కొమురెల్లి, ఎలేందర్ పాల్గొన్నారు.

జూలై 9న అన్నిరంగాల కార్మికులతో దేశవ్యాప్త సమ్మె

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రమ

మాట్లాడుతున్న సీఐటీయూ నాయకురాలు ఎస్‌వీ రమ

జనగామ చౌరస్తా, జూన్ 7 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జూలై 9న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్‌వీ రమ పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలో సీఐటీయూ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన రమ మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నదని విమర్శించారు. ఇవి అమలైతే దీంతో కార్మికులకు కనీస వేతనం, సంఘం పెట్టుకునే హక్కు, సమ్మె చేసే హక్కు కోల్పోవాల్సి వస్తుందన్నారు. 8 గంటల పని సమయాన్ని 12 గంటలకు పెంచి కార్మికులను శ్రమ దోపిడీ చేసే అవకాశం కార్పొరేట్ సంస్థలకు కల్పిస్తున్నారని రమ తెలిపారు. దీనిని అడ్డుకోవడానికి దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు యాటల సోమన్న, జిల్లా అధ్యక్షుడు రాపర్తి రాజు, కార్యదర్శి సుంచు విజేందర్, కోశాధికారి అన్నబోయిన రాజు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జోగు ప్రకాశ్, నాయకులు బూడిద ప్రశాంత్, తాండ్ర ఆనందం, జీపీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బత్తిని వెంకన్న, రామచంద్రం, శంకర్, రమేశ్, శ్రీనివాస్, రామతార తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ బకాయిలు ప్రభుత్వం విడుదల చేయాలి

గూడూరులో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

పాలకుర్తి, జూన్ 7: రజకులకు అందిస్తున్న ఉచిత విద్యుత్ బకాయిలను తక్షణమే విద్యుత్ శాఖకు చెల్లించాలని రజక వృత్తిదారుల సంఘం మండల ప్రధాన కార్యదర్శి ఈదూనూరి మదార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. శనివారం మండలంలోని గూడూరులో రజక సంఘం నాయకులతో కలిసి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 17వ తేదీన హైదరాబాద్‌లోని ఇందిరా పార్కులో ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రజకులకు 250 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను అందించిందన్నారు. కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి రాగానే విద్యుత్ బకాయిలు చెల్లించకపోవడంతో వేలాది రూపాయల బిల్లులు పెరిగిపోయాయన్నారు. రజకులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. 50 ఏళ్లు నిండిన రజకులకు పెన్షన్ ఇవ్వాలని ఆయన కోరారు.. ఈ కార్యక్రమంలో లొంక రజాక్, జ్యోతి యాదగిరి, జ్యోతి ఆంజయ్య, పరశురాములు, సోమయ్య, ఈశ్వరయ్య, పవన్ కుమార్ పాల్గొన్నారు.

15 మంది ఎస్సైల బదిలీ

సుబేదారి, జూన్ 7: వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో 15 మంది ఎస్సైలను బదిలీ చేస్తూ శనివారం సీపీ సన్‌ప్రీత్ సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. టాస్క్‌ఫోర్స్‌లో పని చేస్తున్న రావుల రణధీర్ దుగ్గొండికి బదిలీ కాగా, ఇక్కడ పనిచేస్తున్న ఎన్.వెంకటేశ్వర్లును ఇంతేజార్‌గంజ్‌కు బదిలీ చేశారు. సుబేదారిలో పనిచేస్తున్న ఎన్. రవికిరణ్ ఇంతేజార్‌గంజ్‌కు బదిలీ అయ్యారు. మట్టెవాడలో పనిచేస్తున్న ఎస్.విఠల్ పరకాలకు బదిలీ కాగా, ఇక్కడ పని చేస్తున్న ఎస్.శశికృష్ణను మట్టెవాడకు ట్రాన్స్‌ఫర్ చేశారు. మట్టెవాడలో పని చేస్తున్న నవీన్‌కుమార్ కేయూసీ, కాజీపేట ట్రాఫిక్‌లో పని చేస్తున్న రామారావు ఎస్‌బీ, వరంగల్ పీటీసీలో పనిచేస్తున్న రాజు ఎనుమాముల, వీర్‌లో ఉన్న చాంద్‌పాషా కేయూసీ, పోస్టింగ్ వెయిటింగ్‌లో ఉన్న శ్రీనివాస్ మట్టెవాడ, వెయిటింగ్‌లో ఉన్న సురేశ్ ఆత్మకూర్‌కు బదిలీ అయ్యారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అడ్మిషన్లు పెంచాలి

కోమల్ల, హిమ్మత్‌నగర్‌లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు

రఘునాథపల్లి, జూన్ 7: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అడ్మిషన్లు పెంచేందుకు గ్రామస్తులు సహకరించాలని ప్రధానోపాధ్యాయులు నర్సింహులు కోరారు. మండలంలోని కోమల్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి గ్రామంలో ర్యాలీ చేపట్టారు. ప్రైవేట్ స్కూళ్లు వద్దు.. సర్కారు స్కూళ్లే ముద్దు అని నినాదాలు చేశారు. హెచ్ ఎంనర్సింహులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధి కోసం మౌలిక సదుపాయాలు కల్పించి ఉచితంగా పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం అందిస్తున్నదన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్యప్రకాశ్, శ్రీనివాస్, మేణుమాధవ్, సురేశ్ పాల్గొన్నారు.

జఫర్‌గఢ్‌లో..

జఫర్‌గఢ్ : మండలంలోని హిమ్మత్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో బడిబాట కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ రాపర్తి రమ మాట్లాడుతూ సర్కారు స్కూళ్లలోనే నాణ్యమైన విద్య లభిస్తుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. హెచ్ఎం మంగు జయప్రకాష్ మాట్లాడుతూ హిమ్మత్‌నగర్ పాఠశాలలో చదివిన విద్యార్థులు మండల స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం లభిస్తుందని వివరించారు. తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి సౌకర్యాలను వినియోగించుకోవాలని ప్రజలను ఆయన కోరారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ ఫలితాల విడుదల

ఎస్ఎస్‌సీలో 69.04 శాతం, ఇంటర్‌లో 67.17 శాతం ఉత్తీర్ణత

హనుమకొండ చౌరస్తా, జూన్ 7 : ఓపెన్ స్కూల్ ఎస్ఎస్‌సీ, ఇంటర్ ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. ఎస్ఎస్‌సీ ఉమ్మడి వరంగల్ జిల్లాలో 2,478 అభ్యర్థులు హాజరుకాగా 1,711,(69.04 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారని, ఇంటర్‌లో 4,449 అభ్యర్థుల హాజరు కాగా 2,989 (67.17 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారని ఓపెన్ స్కూల్ ఉమ్మడి వరంగల్ జిల్లా కో ఆర్డినేటర్ సదానందం తెలిపారు. ఎస్ఎస్‌సీలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా నుంచి 269 అభ్యర్థులు హాజరుకాగా 216(80 శాతం), మహబూబాబాద్ నుంచి 441 అభ్యర్థులు హాజరు కాగా 337(76 శాతం), వరంగల్ నుంచి 478 మంది అభ్యర్థులు హాజరు కాగా 127(26.7 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారని, హనుమకొండ జిల్లాలో 390 మంది హాజరుకాగా 318(81.6 శాతం), జనగామ జిల్లాలో 349 మందికి 293(84 శాతం), ములుగు జిల్లాలో 553 అభ్యర్థులు హాజరు కాగా 420(76 శాతం) మంది ఉత్తీర్ణులైనట్లు తెలిపారు.

ఇంటర్మీడియట్‌లో..

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 349 అభ్యర్థులు హాజరుకాగా 302(76.6 శాతం) మంది, మహబూబాబాద్ జిల్లాలో 657 మందికి 488(74.2 శాతం), వరంగల్ జిల్లాలో 650 మందికి 323(49.7 శాతం), హనుమకొండ జిల్లాలో 997 మందికి 673(67.5శాతం), జనగామ జిల్లాలో 942 మందికి 777(82.48), ములుగు జిల్లాలో 809 మంది హాజరుకాగా, 426(51.6 శాతం)మంది ఉత్తీర్ణులైనట్లు తెలిపారు.

పాలకుర్తిలో సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఏసీపీ నర్సయ్య

సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావాలి

పాలకుర్తి, జూన్ 7: గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు దాతలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ముందుకు రావాలని వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య కోరారు. శనివారం మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను సీఐ గట్ల మహేందర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. సీసీ కెమరాలను ప్రతి గ్రామంలో ఏర్పాటు చేసి పోలీస్‌స్టేషన్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేస్తామన్నారు. ఒక సీసీ కెమెరా వంద మందితో సమానమన్నారు. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటునకు కృషి చేస్తామని, ఇందుకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సై దూలం పవన్‌కుమార్, వ్యాపారులు పగడాల శ్రీధర్, చారగొండ్ల ప్రసాద్, బోనగిరి కృష్ణమూర్తి, ఇమ్మడి వీరన్న, పన్నీరు సమ్మయ్య, నంగునూరి రవీందర్, రాపాక సత్యనారాయణ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకుడు ఆకుల శ్రీనివాస్

భవన నిర్మాణ కార్మికులకు ఆర్థిక సాయం పెంచాలి

జనగామ చౌరస్తా, జూన్ 7 : భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సాయాన్ని మరింత పెంచాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని గబ్బెట గోపాల్‌రెడ్డి భవన్‌లో ఏఐటీయూసీ క్రియాశీల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు లేనందున అన్యాయం జరుగుతున్నదని తెలిపారు. ప్రమాదవశాత్తు మరణించిన కార్మికులకు ప్రభుత్వం రూ.6 లక్షలు మాత్రమే ఇస్తున్నదని పేర్కొన్నారు. దీనిని రూ.10 లక్షలకు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మికుల పిల్లల వివాహాలకు, ప్రసూతికి రూ.30 వేలు ఇస్తున్నారని, దానిని రూ లక్షకు పెంచాలని కోరారు. 50 ఏళ్లు నిండిన కార్మికులకు రూ.5 వేల పెన్షన్ ఇవ్వాలని పేర్కొన్నారు. దీనిపై ఇప్పటికే ప్రభుత్వానికి మెమోరాండం ఇచ్చామని తెలిపారు. కార్మికుల సమస్యలను పాలకులు పట్టించుకోకుంటే ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుద్దాల యాదగిరి, అచ్యుత్, మల్లేశం, రాములు, నాగరాజు, యాకుబ్, నాగేశ్, సిద్ధులు, రాములు, ప్రభాకర్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందిస్తున్న సామాజిక సేవా కార్యకర్త సందీప్

పేదింటిబిడ్డ వివాహానికి పలువురి ఆర్థిక సాయం

బచ్చన్నపేట, జూన్ 7 : మండల కేంద్రంలోని ఇందిరానగర్‌కు చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన బొమ్మెళ్ల సుజాత, బాల్‌నర్సయ్య దంపతుల కుమార్తె వివాహం శనివారం జరిగింది. ఈ సందర్భంగా సామాజిక సేవా కార్యకర్త జంగిటి విద్యానాథ్ రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు. బచ్చన్నపేటకు చెందిన యువత నేత జిల్లా సందీప్ సైతం రూ.5 వేలు అందించి మానవత్వం చాటుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలకు ఆర్థిక సాయం అందిస్తే జీవితంలో సంతృప్తి కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నల్లగోని బాలకిషన్‌గౌడ్, కోడూరి మహాత్మాచారి, నల్లనాగుల వెంకన్న, ఎద్దు హరీశ్, ఆల్వాల ఎల్లయ్య, చెరుకూరి శ్రీనివాస్, రామదాసు, రమేశ్, శ్రీనివాస్, రాము, వేణువందన, హరిబాబు పాల్గొన్నారు.

క్రీడాకారులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న బస్వరాజు, శ్రీనివాస్

త్వరలో జిల్లాలో హెచ్‌సీఏ మహిళా పోటీలు

హనుమకొండ చౌరస్తా, జూన్ 7 : త్వరలో జిల్లాలో హెచ్‌సీఏ ఆధ్వర్యంలో మహిళా పోటీలు నిర్వహించనున్నట్లు హెచ్‌సీఏ జిల్లా కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ తెలిపారు. ఉమ్మడి వరంగల్‌లోని 6 జిల్లా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన క్రికెట్ కోచింగ్ క్యాంప్ ముగింపు వేడుకలు వంగపల్లి క్రికెట్ క్రీడామైదానంలో నిర్వహించారు. సంయుక్త కార్యదర్శి బస్వరాజు క్రీడాకారులకు సర్టిఫికెట్లు అందించారు. జిల్లా ఉపాధ్యకుడు సదాశివ్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాబోయే ఏజీఎం మీటింగ్‌లో జిల్లాకు ఫ్లడ్‌లైట్ల వెలుగులో క్రికెట్ అకాడమీ ఏర్పాటుకు త్వరలో పర్మిషన్ ఇవ్వబోతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హైదరాబాద్ క్లబ్ కార్యదర్శులు భార్గవ్, శంకర్, జిల్లా సంయుక్త కార్యదర్శి బస్వరాజు ఉపేందర్, కార్యవర్గ సభ్యులు వేణు గోపాల్, అభినవ వినయ్, అజయ్ సారథి పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

సెప్టిక్ ట్యాంక్ క్లినర్
SepTeK
★ సెప్టిక్ ట్యాంక్ క్లినర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫార్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455.
NTW-337056

PLOT FOR SALE
★ఆల్ డెవలప్‌మెంట్ D.T.C.P లే-అవుట్, 1) యాదగిరి, 2) ఘట్‌కేసర్,